## రేపు జాబ్ మేళా

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : ఈనెల 12న జిల్లా ఉపాధి కార్యాలయంలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 18 నుంచి 28 ఏళ్ల వయసు కలిగి, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7093514418 నంబరును సంప్రదించాలని సూచించారు.



భూమి పూజ చేస్తున్న యాదవులు

## గంగమ్మ గుడినిర్మాణానికి భూమి పూజ

డోర్నకల్, మార్చి 10: మండల కేంద్రం శివారులోని మున్నేరు వాగు సమీపంలో గంగమ్మ గుడి నిర్మాణానికి సోమవారం యాదవులు భూమి పూజ చేశారు. గంగమ్మ గుడి నిర్మాణానికి డోర్నకల్ యాదవ్ నగర్‌కు చెందిన అన్నదమ్ములు సకినాల వెంకన్న, సకినాల సీతారాములు భూమిని విరాళంగా అందించారు. కాలా మహేందర్ జైన్, తాళ్లూరి హనుమ, మాదా శ్రీను, కోటి లింగం, పచ్చిపాల మల్లేశం, నాని యాదవ్, కొత్త రాంబాబు, పచ్చిపాల గోపి, హరికృష్ణ, జక్కుల సురేశ్, రామకోటేశ్ పాల్గొన్నారు.

## పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఈదులపూసపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ టీచర్లు వెనుకబడిన విద్యార్థులపై దృష్టిపెడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఏఎంవో ఆజాద్ పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఎంపీడీవో యాకయ్య

## అంగడి వేలం

నర్సింహులపేట, మార్చి 10: మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే అంగడి (సంత) వేలాన్ని సోమవారం ఎంపీడీవో కిన్నెర యాకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. 12 మంది రూ.50వేల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. కౌసల్యదేవిపల్లికి చెందిన కొత్త వెంకటయ్య రూ.16లక్షల 50వేలకు దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.15లక్షల 77వేలకు పాడగా, ఈసారి అదనంగా రూ.75వేలు గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చింది. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం కిస్తీలు చెల్లించాలని, మేకలు, గొర్రెలు, కూరగాయల వ్యాపారుల నుంచి పంచాయతీ నిబంధనల ప్రకారం రుసుము వసూలు చేయాలని ఎంపీడీవో సూచించారు. జీపీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# మరిపెడలో కాంగ్రెస్ నాయకుడి పెత్తనం

- ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో ఆ పార్టీ మండల అధ్యక్షుడి రివ్యూ
- తొలుత ఎమ్మెల్యే వస్తున్నట్లు సమాచారం ఇచ్చి..
- అధికారులు చేరుకోవడంతో రద్దయ్యినట్లు చెప్పి సమీక్ష



రివ్యూ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి

మరిపెడ, మార్చి 10: మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడి పాలన నడుస్తోంది. ప్రజాప్రతినిధి కాకున్నా ఆ స్థాయిలో సమీక్షలు నిర్వహించడం, అధికారులపై పెత్తనం చెలాయిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మండలంలో తనకు తెలియకుండా ఎలాంటి పనులు చేయొద్దని అధికారులకు హుకుం జారీ చేసినట్లు ప్రచారమవుతోంది. ఎమ్మెల్యే ఆదేశాలతోనే అతడు ఇలా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా సోమవారం జరిగిన మరో ఘటనతో ఇది నిరూపితమైంది. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ రివ్యూ మీటింగ్ ఉంటుందనే సమాచారంతో ఎంపీడీవో, ఎంపీవో, కార్యదర్శులు విశ్రాంతి భవనానికి చేరుకున్నారు. కొంత సమయం తర్వాత అనివార్య కారణాలతో ఎమ్మెల్యే కార్యక్రమం రద్దయ్యిందంటూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి సమీక్ష నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. సుమారు రెండు గంటల పాటు అధికారులతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రివ్యూ చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులదే పెత్తనం నడుస్తోందని ఇప్పటికే చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో ఇలాంటి ఘటనలు ఆ మాటలను నిజం చేస్తున్నాయి. అధికార పార్టీ మండల నాయకుడు సమీక్ష చేయడంతో అధికారులు, కార్యదర్శు లు ఏమీ అనలేని పరిస్థితిలో ఉండిపోయారు. ఎదురుచెప్పలేక రివ్యూలో పాల్గొన్నట్లు కొందరు అధికారులు చెప్పారు. ఎమ్మెల్యే రివ్యూ మీటింగ్ ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో కాకుండా విశ్రాంతి భవనంలోని ఇరుకైన గదుల్లో ఎందుకు నిర్వహిస్తారని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా స్పందించి కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహక చర్యలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి బస్తాలు

**10వేల బస్తాలు రాక.. సందర్శించిన సీఐ**

కేసముద్రం, మార్చి 10: మూడు రోజుల సెలవుల తర్వాత సోమవారం మార్కెట్ ప్రారంభమైంది. 10వేల బస్తాల మిర్చి విక్రయానికి వచ్చింది. ఉదయం 8 గంటల్లోపు మార్కెట్‌కు విక్రయానికి తీసుకువచ్చిన సుమారు 6వేల బస్తాల మిర్చికి ఈ-నామ్ విధానం ద్వారా టెండర్ నిర్వహించి కాంటాలు నిర్వహించారు. మరో 4వేల బస్తాల మిర్చికి టెండర్ వేయలేదు. వీటి కాంటా రేపటికి వాయిదా వేశారు. సోమవారం క్వింటాల్ మిర్చి గరిష్టంగా రూ.13,599, కనిష్టంగా రూ.10,010 పలికింది. మార్కెట్‌లో మిర్చి బస్తాలు పేరుకుపోవడంతో రైతులు మంగళవారం మార్కెట్‌కు మిర్చిని విక్రయానికి తీసుకరావద్దని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సూచించారు. మార్కెట్ పరిస్థితులు గమనిస్తూ రైతులు మిర్చి విక్రయానికి తీసుకురావాలని సూచించారు. మార్కెట్‌ను మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజ్ సందర్శించారు. మార్కెట్‌కు మక్కజొన్న, మిర్చి ఎక్కువగా విక్రయానికి వస్తున్నందున ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు.



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

**మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు**

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సెక్రటరీ షంషీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డ్‌కు 20వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయని, మార్కెట్‌లో బస్తాలు పెట్టడానికి ఖాళీ స్థలం లేదని, కాంటాలు సైతం ఆలస్యమవుతుందని ఈనెల 12, 13 సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఈనెల 14న హోలీ, 15న శనివారం వారాంతపు సెలవు, 16న ఆదివారం యార్డ్‌కు సెలవు ఉందని వివరించారు. ఈనెల 12 నుంచి 16 వరకు సెలవులు ఉన్నాయని, తిరిగి 17న మార్కెట్ పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి వ్యవసాయమార్కెట్‌కు సరుకులు తీసుకురావద్దని కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో వివిధ మండలాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డోర్నకల్ మండలం బూర్గపహాడ్‌కు చెందిన అప్పారావు ఇంటి పక్కన ఉన్న రావిచెట్టు వేళ్లతో ఇంటికి పగుళ్లు వస్తున్నాయని పరిష్కరించాలని కోరారు. బేతోలుకు చెందిన భూక్య బుజ్జి తన భూమి సమస్యలను పరిష్కరించాలని, కురవి మండలం కందికొండకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తిలింగం ఇంటి స్థలం, వ్యవసాయ భూమి కేటాయించాలని కోరారు. జిల్లాలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, వెల్ఫేర్ నుంచి మొత్తం 84 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు నరసింహారావు, హరిప్రసాద్, సురేష్, ధనమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

## ఎస్సారెస్పీ కాల్వకు గండి

కురవి, మార్చి 10: మండలంలోని మోదుగులగూడెం సమీపంలో రేగులకుంటలోకి నీటిని తరలించేందుకు ఆదివారం రాత్రి తండాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు ఎస్సారెస్పీ కాల్వకు గండి పెట్టారు. కాల్వకు గండి పడి వరద బయటకు ఒక్కసారిగా వచ్చింది. వరద నీటి వల్ల 10 ఎకరాల మామిడితోట, పొలానికి నష్టం వాటిల్లింది. గండి పడిన ఎస్సారెస్పీ కాల్వను అధికారులు పూడ్చకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది.



గండి పడి వృథాగా పోతున్న నీరు



ట్యాంకర్ ద్వారా ఇంటింటికీ నీటిని అందిస్తున్న జీపీ కార్యదర్శి సాత్విక్

## ట్యాంకర్ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా

*'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్*

నర్సింహులపేట, మార్చి 10: మండలంలోని అజ్మీరాతండా జీపీ పరిధి గొల్లబంజరలో అధికారులు ఇంటింటికీ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. 'గొల్లబంజరలో తాగునీటికి గోస' శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీపీ కార్యదర్శి జీ సాత్విక్ స్వయంగా ట్యాంకర్‌తో నీటిని పోయించారు. మిషన్ భగీరథ పైపు ఏర్పాటు చేసేందుకు మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో యాకయ్య తెలిపారు.

## బీటీ రోడ్డు నాణ్యత లేదని ధర్నా

గార్ల, మార్చి 10: ముత్తితండా క్రాస్‌రోడ్డు నుంచి పోచారం వెళ్లే బీటీరోడ్డు నాణ్యతగా లేదని, కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని ముత్తితండా క్రాస్‌రోడ్డు వద్ద తండా ప్రజలు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కాంట్రాక్టర్, ఆర్ అండ్ బీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా హరినాయక్, శ్రీను, రమేశ్, శంకర్, మల్సూర్ పాల్గొన్నారు.



ముత్తితండా రోడ్డుపై ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

## ఒకరికి ఏడాది జైలు, వెయ్యి జరిమానా

తొర్రూరు, మార్చి 10: జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతలకు చెందిన గాడిపల్లి వెంకన్న, తండ్రి సోమయ్యకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. కరూర్ ఎస్సై గొల్లమూడి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో బొమ్మకల్‌కు చెందిన బాధితురాలు భర్త గాడిపల్లి వెంకన్నపై ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై సుబ్బరెడ్డి కేసు నమోదు చేసి, చార్జ్‌షీట్ కోర్టులో దాఖలు చేశారు. తుది విచారణలో కోర్టుకు సాక్షాధారాలు సమర్పించగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతిదేవి, జయలత కేసు వాదించారు. విచారణ తర్వాత కేసు వివరాలు సమీక్షించిన తొర్రూర్ జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత గాడిపల్లి వెంకన్నకు ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

## ఉపాధి అవకతవకలపై అధికారుల ఆగ్రహం

కేసముద్రం, మార్చి 10: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో నిర్వహించిన పనులు, డబ్బుల చెల్లింపుపై సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా గ్రామాల్లో విచారణ చేపట్టగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 41 గ్రామాలు ఉండగా 27 గ్రామాలపై పనులు, చెల్లింపులపై చదివి వినిపించారు. మరో 14 గ్రామాల వివరాలను మంగళవారానికి వాయిదా వేశారు. కొన్ని గ్రామాల్లో ఒకే పనికి రెండుసార్లు డబ్బులు తీసినట్లుగా గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అవకతవకలకు పాల్పడినవారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ప్రజావేదికకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ప్రజా వేదికకు అధికారులు, కార్యదర్శిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్, విజిలెన్స్ జిల్లా అధికారి మన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

## ఇసుక ఉచితంగా అందించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 10: ఇల్లు కట్టుకునే ప్రతి ఒక్కరికీ ఇసుక ఉచితంగా అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంట ఉపేందర్, ఆకుల రాజు డిమాండ్ చేశారు. సోమవారం అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారికి సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక పాలసీలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఉచితంగా అందించేందుకు నిర్ణయించిందని, అలా కాకుండా ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్క రికీ ఇసుక ఉచితంగా అందించాలన్నారు. ఇసుక పాలసీ వల్ల ఇల్లు కట్టుకునేవారికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కోటేశ్వరరావు, శంకర్, వెంకన్న, శ్రీనివాస్, రాము, బిచ్యా పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసమర్థతతో ఎండిపోతున్న పంటలు

కేసముద్రం, మార్చి 10: ప్రభుత్వ అసమర్థత కారణంగానే పంటలు ఎండిపోతున్నాయని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆరోపించారు. మండలంలోని ఉప్పరపల్లిలో వట్టివాగుకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని కోరుతూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ దామోదర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సాగునీరు విడుదల చేయకపోవడంతో వేలాది రూపాయలు పెట్టి సాగుచేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేయకుంటే ఆందోళన చేస్తామన్నారు. మాజీ సర్పంచ్ ఎల్లబోయిన సారయ్య, రైతులు అంకిరెడ్డి వీరయ్య, కంకల దేవేందర్, కోటయ్య, ఖాసీం, ఉపేందర్, సురేందర్, సాయి ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

# రైతుభరోసా, రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలి

మరిపెడ, మార్చి 10: రైతుభరోసా, రూ.2లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం 3వ మహాసభలు మండలంలోని నీలికుర్తిలో సోమవారం జరగ్గా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర కల్పించకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టి, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. అనంతరం మండల అధ్యక్షుడిగా సత్యం, కార్యదర్శిగా జనార్ధన్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, వెంకన్న, రామయ్య ఉన్నారు.





మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తొర్రూరు, మార్చి 10: గ్రామ పంచాయతీ సిబ్బందికి మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధం 106) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. యూనియన్ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ ఉద్యోగులకు గ్రీన్‌చానల్ ద్వారా ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు అందిస్తే, గ్రామ పంచాయతీ ఉద్యోగులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్నారు. జీపీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభా నేపథ్యంలో సిబ్బంది సంఖ్య పెంచాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడియా బీకు మాట్లాడుతూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ మండల అధ్యక్షులు గుండాల సోమ నరసయ్య, సహాయ కార్యదర్శి పైడిపాల ప్రమోద్, మండల నాయకులు యనమాల శ్రీధర్, గుంశావళి సురేందర్ మల్లేశ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్



డోర్నకల్: ముల్కలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సావిత్రిబాయికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

నమస్తే, నెట్‌వర్క్, మార్చి 10: దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. మహబూబాబాద్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి వీరన్న, తరుణ్, అరుణ, లావణ్య, గాయత్రి, డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు కేలోత్ సాయికుమార్, సూర్యప్రకాశ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో టీపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి ఎంఈవో అంగోత్ లక్ష్మా పూలమాల వేసి నివాళులర్పించారు. కాంప్లెక్స్ హెచ్ఎం రుక్మాంధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. టీపీటీఎఫ్ మండల కార్యదర్శి బీ.శ్రీనివాస్, ఉపాధ్యాక్షురాలు కే.పద్మావతి, హరినాథ్, సుకన్య పాల్గొన్నారు. గార్లలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ నాయకులు మాలోత్ శాంతికుమార్, భూక్యా లక్ష్మణ్, భూక్యా శ్రీను, వెంకన్న, యుగేందర్, సలీం, మోతి లాల్ పాల్గొన్నారు. కురవి అంబేద్కర్ సెంటర్‌లో ఇనుగుర్తి గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పప్పుల వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మాంకాలి సలీం, కోశాధికారి గోపందాసు కృష్ణ, చిన్నాల కట్టయ్య, జాటోత్ హరిచంద్, పింగిలి శ్రీనివాస్, గుజ్జునూరి వెంకన్న, నాగెల్లి వెంకన్న పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

డోర్నకల్/ నెల్లికుదురు/ ఇనుగుర్తి, మార్చి 10: ముల్కలపల్లి జడ్పీ పాఠశాల 65 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం మాజీ ఎంపీటీసీ నాగమణి మధు సూదన్‌రావు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్‌ను ఎంఈవో అంగోత్ లక్ష్మా చేతులమీదుగా అందజేశారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కాంక్షించారు. హెచ్ఎం రుక్మాందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నెల్లికుదురు మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు సోమవారం పల్లెపోతుల లక్ష్మీనర్సయ్య పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు ఇతర సామగ్రి అందించారు. మండల విద్యాశాఖ అధికారి ఏ.రాందాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇనుగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్నముప్పారం, కోమటిపల్లి పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు సోమవారం వేం చారిటబుల్ ట్రస్ట్, జీపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు వితరణ చేశారు.

## పాఠశాలకు బెంచీలు అందజేత

ఇనుగుర్తి, మార్చి 10: మండలంలోని చిన్నముప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానికులైన కామినేని శ్రీకాంత్ - మమత దంపతులు రూ.50వేల విలువైన 10 బెంచీలను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో బెంచీలు అందించినట్లు తెలిపారు. బెంచీలు అందించిన శ్రీకాంత్ - మమత దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

## స్వేచ్ఛగా పరీక్షలు రాయాలి

కేసముద్రం, మార్చి 10: విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని కల్వల హైస్కూల్, మోడల్ స్కూల్, కేసముద్రం స్టేషన్ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం వేం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాసి 10 జీపీఏ సాధించాలని సూచించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, ఆర్‌టీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల మురళి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు తేరాల శ్రీనివాస్, నవాజ్, అయూబ్‌ఖాన్, గండి శ్రీనివాస్, గంట కవిత, గంట రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దుర్గాభవానీకి కలాం పరిశోధన అవార్డు



తొర్రూరు, మార్చి 10: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కాకిరాల దుర్గాభవానీ తమిళనాడులోని ఎస్‌ఆర్ఎం విశ్వవిద్యాలయం నుంచి ప్రతిష్టాత్మక ఏపీజే అబ్దుల్ కలాం పరిశోధన అవార్డు అందుకున్నారు. తన పరిశోధనలకు గుర్తింపుగా ఎస్‌ఆర్ఎం యూనివర్సిటీ ఈ అవార్డు అందించినట్లు తెలిపారు. ఆమె తొర్రూర్ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్ కుమార్తె.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఇనుగుర్తి, మార్చి 10: మండలంలోని చిన్నముప్పారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ కాలేరు నరహరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులను సోమవారం యదవ కులస్తులు పరామర్శించి రూ.21వేల ఆర్థికసాయం అందజేశారు. నర్ర చంద్రయ్య, చిన్నాల కట్టమల్లు, మార్గం రాజీరు, ఏర్పుల నరహరి, నర్రా అశోక్, సుధాకర్, రాజు, ఉమేశ్, వీరన్న, యాకయ్య ఉన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న యాదవులు

## సమస్యల పరిష్కారానికి పోరాడాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 10: స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్ణపు సోమయ్య అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీని అభివృద్ధి చేయటంలో విఫలమయ్యాయని అన్నారు. పట్టణంలో తాగునీరు, డ్రెయినేజీ, పారిశుధ్యం తదితర సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భిక్షపతి, రవి, మహేశ్, యాకయ్య, రమేశ్ పాల్గొన్నారు.

## మహిళలకు సముచిత స్థానం కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని మాధవాపురం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సంకా బద్రీనారాయణ అన్నారు. సోమవారం మాధవపురం పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ మహిళలపై ఇంకా కొన్ని చోట్ల వివక్ష కొనసాగుతోందన్నారు. మహిళలు ప్రత్యేక చట్టాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. మహిళా టీచర్లను శాలువాతో ఘనంగా సత్కరించారు. నాగయ్య, పరమాత్మచారి, బాబురెడ్డి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పాఠశాల హెచ్ఎం

## శాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టిసారించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : కళాశాల విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని రిటైర్డ్ ప్రొఫెసర్ కే లక్ష్మారెడ్డి సూచించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'విజ్ఞానశాస్త్రంలో మహిళ పాత్ర' అనే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సైన్స్‌ను మరింత అభ్యసనం చేస్తూ నిత్య జీవితంలో వచ్చే సమస్యలను పరిష్కరించేలా చూసుకోవాలన్నారు. సైన్స్‌పై పరిజ్ఞానం ఉన్న వారు ఏరంగంలో అయినా రాణించే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైన్స్ విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బిందుమాధురి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వైన్స్‌షాపు ఎదుట ఆందోళన


దంతాలపల్లి, మార్చి 10: మద్యం ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ మండల కేంద్రంలోని కౌశిక్ వైన్స్ షాపు ఎదుట సోమవారం మద్యంప్రియులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వైన్స్‌షాపు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. పర్మిట్‌రూమ్‌కు అనుమతి లేకపోవడంతో కాలనీ రోడ్డుపై మలమూత్ర విసర్జన చేయగా దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అపరిశుభ్రతకు కారమణమవుతున్న కౌశిక్ వైన్స్‌షాపును తొలగించాలని మండల పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా మద్యం అమ్ముతూ, కోరిన బ్రాండ్ వైన్స్ షాపులో ఉన్నప్పటికీ ఇవ్వకుండా బెల్టు షాపులకు ఇస్తూ అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు.



అపరిశుభ్రతను ఎంపీవోకు చూపుతున్న కాలనీవాసులు

## ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం

కేసముద్రం, మార్చి 10: మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు సోమవారం వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్ స్కూల్‌లో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు మండలంలోని కల్వాల, కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజీ, అమీనాపురం, తిమ్మంపేటలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

## ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

దంతాలపల్లి, మార్చి 10: ప్రభుత్వం పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈమేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వివేక్‌రామ్‌కు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలకు పనిచేస్తున్న తమకు రెండు నెలలుగా వేతనాలు లేక కుటుంబాలు గడిచే పరిస్థితి లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రంజిత్, వెంకన్న, విజయ, శంకర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు